గరిమెళ్ల విశ్వనాథం

# ఆవిడే ఈవిడ

మధ్యాహ్నం ఒంటిగంటయింది.

కమలాకర్ డైనింగ్ టేబిలుముందు కూర్చున్నాడు. భార్య నళిని వడ్డిస్తూన్నది.

"ఈరోజు విశేషాలేమిటో" అడిగాడు కమలాకర్.

కమలాకర్‌కి మధ్యాహ్నం భోజనం చేస్తూ కాలనీలో విశేషాలు భార్యనుంచి వినడం ఒక పరిపాటి.

కమలాకర్ బి హెచ్ ఇఎల్ లో పనిచేస్తున్నాడు. కమలాకర్ ఆఫీసుకి వెళ్లగానే ఇంటిపనులు ముగించుకుని ఎవరో ఒకరి ఇంట్లో గృహిణుల్తో పిచ్చాపాటికి వెళ్లి పన్నెండున్నరకి ఇంటికి రావడం ఒకవిధమైన కర్తవ్యంలా పెట్టుకుంది నళిని.




పిచ్చాపాటిలో నలుగురైదుగురు గృహిణులుకూడడం, సంభాషణలో సగం కాలం వారి భర్తలు ఇంటివద్ద చెప్పిన విషయాలు చర్చించడానికి వినియోగిస్తూ వుండడం జరుగుతూంటుంది. ఆ విషయాలని విమర్శించడంకాని, సమర్థించడంకాని సమయానుకూలంగా చేస్తూ వుంటారు. అప్పుడప్పుడూ ముందురోజు విమర్శించిన విషయం మర్నాడు సమర్థించడం కూడా జరిగేది. దీన్ని మిగతా గృహిణులు సాధారణంగా తప్పు పట్టుకునేవారు కాదు. ఇది వారిలో ఒకరిమీద ఇంకొకరికి ఉన్న అవగాహనకు సాక్ష్యం.

నళిని దగ్గరనుంచి జవాబు రాకపోతే కమలాకర్ మళ్లీ అదే ప్రశ్న వేశాడు. కమలాకర్‌కి ఆ విషయాలమీద అంత పట్టింపు లేదు కాని తింటున్నంతసేపూ నళిని మాట్లాడుతూ వుంటే ఆ మాటల్లో వున్న మాధుర్యానికి వంటకాల్లో లోపాలు కప్పడిపోతూ ఉంటాయి.

కమలాకర్ కొంత ధ్యానంగా వింటాడు.

మిగతా మాటలు ఒక చెవిలోనుంచి మరో చెవి బయటకు నాన్‌స్టాపుగా ప్రయాణం చేస్తాయి.

"ఏముంది చెప్పడానికి. ఏవో ఆడవాళ్లమధ్య సంభాషణలు".

"అలాక్కాదులే. కొన్ని ఆఫీసుల్లో జరిగే పనులు ఆఫీసులో తెలియవుకానీ ఆ విషయాలు మీ మధ్య పూర్తిగా చర్చించబడతాయి"

"అదేం లేదుగాని, ఏమిటో పెద్ద పుద్యోగస్తుల భార్యలు ఆకతాయి జనంలా మాట్లాడడం అసహజంగా కన్పిస్తుంది. ఆ మాటలు వింటుంటే అసహ్యంకూడా పుడుతుంది".

"అసలేం జరిగిందో సరిగ్గా చెబుదూ"

కమలాకర్ పులుసు కలుపుకొని ఆస్వాదిస్తూ తలెత్తకుండానే అడిగాడు.

సాధారణంగా వివరాలు చెప్పబోయేముందు అవతలివారికి ఆ విషయంలో ఆసక్తి కలిగించి తరువాత కథ మొదలెడతారు కొందరు. నళినికూడా ఆ కోవకు చెందినదే. కాని కమలాకర్‌కి అంత ఆసక్తి లేదు.

"ఇద్దరి లేడీస్ మధ్యన వారి పిల్లలవలన కలిగిన చిన్న దెబ్బలాటని చినికి చినికి పెద్దదిగా చేసుకున్నారు. ఆఖరికి 'నువ్వు' అంటే 'నువ్వు' అనుకుంటూ చెప్పకూడదుకాని కుక్కల్లా దెబ్బలాడుకున్నారు. నేనుకొంతవరకూ ఉండి, ఇక వినలేక ఇంటికి వచ్చేశాను".

"ఎవరిమధ్యనయింది ఈ దెబ్బలాట?"

నళిని పేర్లు చెప్పింది. కాని కమలాకర్ బయటికి వచ్చి చూశాడు.

స్నేహితుడి భార్య ఉషారాణి నిలబడి వుంది.

"హల్లో ఉషారాణీ! హౌ ఆర్ యూ?"

"ఫైన్ కమల్. నళిని ఇంట్లో వుందా?"

"వుంది. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుందామా. లేకపోతే బయట లాన్‌లో కూర్చుందామా?"

"లాన్‌లో కూర్చుంటే చల్లగా హాయిగా ఉంటుంది"

ఒక్కనిముషం అంటూ కమలాకర్ మూడు కుర్చీలు బయట ఎరేంజ్ చేశాడు. నళిని వచ్చి ఓ పది నిమిషాలు మాట్లాడి కాఫీ తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లింది.

కమలాకర్ ఉత్సాహంగా మాటలు సాగిస్తున్నాడు ఉషారాణితో.

"సారథి టూర్‌లో వున్నాడటకదా! ఎప్పుడు వస్తాడు"

"ఎల్లుండి"

"అయితే విశేషాలేంటి" అడిగాడు కమలాకర్.

"మాకేం తెలుస్తాయి, ఏమయినా ఉంటే ఆఫీసులో పనిచేస్తున్న మీకే తెలియాలి"

"పరేలే ఆఫీసు విషయాలు ఎందుకు కానీ మొన్న మన కాలనీలో చిన్న యుద్ధం జరిగిందట తెలుసా?" అడిగాడు కమలాకర్.

"నాకు తెలియదే" ఆసక్తి ప్రకటించింది ఉషారాణి.

"అదే మొన్న సోమవారం ఉదయం మీ ఇంటి దగ్గర్లోనే. ఇద్దరు ఆఫీసర్ల భార్యలు ఏదో పిల్లల విషయంలో తగవు మొదలుపెట్టి, పెద్దది చేసుకున్నారట"

ఉషారాణి కుర్చీలో కూర్చున్నదేగాని ముళ్లమీద కూర్చున్నట్లు కదులుతున్నది. మొహంలో నెత్తురు క్రమంగా ఇంకిపోతూ వివర్ణమవసాగింది. కాని కమలాకర్ గమనించే స్థితిలో లేదు. చెప్పకుపోతున్నాడు.

"ఏమిటో ఇంత పెద్ద ఆఫీసర్ల స్థాయిలో ఉండికూడా ఎడ్యుకేటెడ్ లేడీస్ అలా దెబ్బలాడుకోవడం ఏం బాగాలేదు. వాళ్లిద్దరూ విపరీతంగా నోరు చేసుకుంటూ, కేకలేసుకుంటూ ఒక్కమాటలో చెప్పాలంటే వీధికుక్కల్లా దెబ్బలాడుకున్నారట. ఛీ! ఛీ! చెప్పకుండుక్కికూడా అసహ్యంగా ఉంది"

ఉషారాణిలో సహనం అడుగంటింది. ఇక వినే స్థితిలో లేదు. లేచి నిలబడటానికి ప్రయత్నం చేస్తున్నది.

కమలాకర్ వాక్ప్రవాహం ఆపలేదు.

"ఆ ఇద్దరు లేడీస్ ఎవరోకాని..."

కమలాకర్ వాక్యం పూర్తిచెయ్యకముందే ఉషారాణి నిలబడి అర్జంటుగా ఇంటికి వెళ్లాలి అంటూ గేటువైపు నడవడం మొదలెట్టింది. క్షణంలో నడక పరుగుగా మార్చి వీధిగేటు దాటిపోయింది.

కమలాకర్ ఆశ్చర్యంతో వెనక్కి తిరిగేటప్పటికి నళిని కాఫీ ట్రే విసురుగా టేబుల్ మీద పెడుతూ కనిపించింది.

"నళినీ! ఉషారాణి ఏదో అర్జంటు పని ఉన్నదంటూ వెళ్లిపోయింది"

"లేకపోతే మీ సంభాషణా చాతుర్యానికి ఆనందిస్తూ ఇక్కడే కూర్చుండిపోవాలా"

కమలాకర్‌కి అర్థంకాలేదు నళిని ఏం మాట్లాడుతున్నది.

"నేను తెరవెనుకనుంచి మీకు సైగ చేస్తున్నాను. మిమ్మల్ని నోరు మూసుకోమని. నన్ను చూడకుండా ఎవరో ఆఫీసర్ల భార్యలు కుక్కల్లా దెబ్బలాడుకున్నారని పురాణం ఆవిడతో మొదలుపెట్టారు"

"అయితే ఏమయింది నువ్వు వచ్చేలోగా ఏదో మాట్లాడాలని..."

కమలాకర్‌ని వాక్యం పూర్తిచెయ్యనివ్వ లేదు నళిని.




"అయితే బుద్ధి లేకుండా నోటికేదొస్తే అది వాగేయడమేనా. ఆ దెబ్బలాడుకున్న వాళ్ళు ఎవరో మీకు జ్ఞాపకం ఉందా?"

కమలాకర్ లేదన్నట్లు తలవూపాడు.

"ఆ ఇద్దరిలో ఒక ఆమే ఉషారాణి!"

అప్పటికి కాని కమలాకర్‌కి అర్థం కాలేదు తను చేసిన తప్పేమిటో, ఉషారాణి ఎందుకు వెళ్లిపోయిందో. *